ప్రమాదకరంగా మలుపులు

- దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో తరచూ ప్రమాదాలు
- ఆందోళన చెందుతున్న వాహనచోదకులు



రాసాలమ్మ కాలనీ మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేని దృశ్యం



ప్రమాదకరంగా ఉన్న దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డు మలుపు

కూర్మన్నపాలెం: దువ్వాడ రైల్వేస్టేషన్ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. రాసాలమ్మ కాలనీ, దువ్వాడ రైల్వేస్టేషన్, దువ్వాడ సెక్టార్–2, రాజీవ్‌నగర్ వెళ్లే రహదారిపై ప్రయాణం చేయాలంటేనే వాహనచోదకులు హడలిపోయే పరిస్థితి నెలకొంటోంది. అగనంపూడి నుంచి రాజీవ్ నగర్ వైపు వెళ్లే రహదారిలో రాసాలమ్మ కాలనీ సమీప కూడలి వద్ద నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మూడు రోడ్ల కూడలి కావడం, దాంతో పాటు పక్కన మలుపు ఉండడంతో ప్రమాదాల సంఖ్య అధికంగా ఉంటోంది. మలుపు వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో అప్రమత్తమయ్యే అవకాశమూ లేకపోతోంది. ఇక్కడ దువ్వాడ రైల్వేస్టేషన్, మరోవైపు దువ్వాడ సెక్టార్–2లో నివాసం ఉండే అనేక కాలనీల్లో, మరో వైపు వీఎస్‌ఈజెడ్, మరియు ఆటోనగర్‌కు చెందిన అనేక పరిశ్రమలు ఉన్నాయి. అందువల్ల ఆయా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులతో పాటు వ్యాపార లావాదేవీలు, ఇతర కూలి పనుల నిమిత్తం వెళ్లే కాలనీవాసులు నిత్యం ఇదే రహదారిలో ప్రయాణిస్తుంటారు. దీంతో ఈ జంక్షన్ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఆ కూడలి వద్దకు వెళ్లే వాహనదారులకు కూడా ఎవరు ఎటు నుంచి వస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంటోంది. దీంతో ఒకరినొకరు ఢీకొనడం, గాయాలపాలవడం షరా మామూలుగా మారిపోయింది.

స్టాపర్ బోర్డులు తొలగిస్తున్న లారీ డ్రైవర్లు

ఈ కూడలి వద్ద ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు కొద్దిరోజుల క్రితమే స్టాపర్స్ ఏర్పాటు చేశారు. అయితే, వాటి కారణంగా భారీ వాహనాలకు ఇబ్బందులు ఎదురు కావడంతో, ఆ వాహనాల డ్రైవర్లు వాటిని తొలగిస్తున్నారని వాహనచోదకులు చెబుతున్నారు. రహదారులకు ఇరువైపులా దట్టమైన ముళ్లపొదలు ఉండడం వల్ల ఎదురుగా వచ్చే వాహనం కనపడడం లేదు. అందువల్ల ఒకరినొకరు తప్పించుకోలేక వాహనాలు ఢీకొంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



వీధిలైట్లు వెలగక పోవడం, చెట్లు ఏపుగా ఎదిగిపోవడంతో లైటింగ్ సరిగ్గా లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వీధి దీపాలు వెలిగేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. హెచ్చరిక బోర్డులు, స్టాపర్లను త్వరలోనే ఏర్పాటు చేస్తాం. వాహనదారుల్లో కూడా అవగాహన కలిగేలా చర్యలు తీసుకుంటాం.

–మహాలక్ష్మి, ట్రాఫిక్ ఎస్‌ఐ, దువ్వాడ స్టేషన్

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం



మహిళకు చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి, అన్ని వర్గాలకు సమన్యాయం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ 76వ వార్డు పరిధి గాంధీనగర్‌లో గురువారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలిసి, వారికి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీనగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లు, నిర్మించామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో పార్కు అభివృద్ధి చేయాలని, ఛిద్రమైన కాలువలు నిర్మించాలని, యువత వ్యాయామం చేసుకునేందుకు అవసరమైన వ్యాయామ పరికరాలు మంజూరు చేయాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తొందరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మంత్రి శంకరనారాయణ, తాటికొండ జగదీష్, ప్రమీల, తెంటు సత్యనారాయణ, అవినాష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ధూమ్‌ధామ్‌గా గాజువాక పరస



పరసలో స్టాళ్ల వద్ద సందర్శకుల సందడి

గాజువాక: గాజువాక సీతారామ, ఉమారామలింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవం (గాజువాక పరస) గురువారం వైభవంగా జరిగింది. ఆటలు, పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో గాజువాక బీసీ రోడ్డులో సందడి చోటుచేసుకుంది. ఈ ఉత్సవాల సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహ పాత్రుడు, గంధం శ్రీనివాసరావు, మహ్మద్ ఇమ్రాన్, పల్లా శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, నాయకులు మద్ది శంకర్‌రెడ్డి, దొడ్డి రమణ, ధర్మాల శ్రీను, గోమాడ వాసు తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు గాజువాక వాసులకు కనువిందు చేశాయి.

క్లుప్తంగా

సాయి ఆలయానికి బంగారు రుద్రాక్షమాల బహూకరణ



సాయిబాబాకు రుద్రాక్షమాల బహూకరించిన వెంకటరమణారెడ్డి దంపతులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి షిర్డీ సాయిబాబా ఆలయ ధర్మకర్త కె.వెంకటరమణారెడ్డి కుటుంబం సాయినాథుడికి రూ.ఒక లక్షా 40వేల విలువైన బంగారు రుద్రాక్షమాలను బహూకరించింది. వెంకటరమణారెడ్డి కుమార్తెలు, అల్లుళ్లు పద్మజ, అరుణ్‌రెడ్డి, నీరజ, ధనిష్ట కుమార్ దానిని బహూకరించారు. ఈ మేరకు ఆలయంలోని సాయినాథుడి విగ్రహానికి రమణారెడ్డి , అరుణ దంపతులు ఆ మాలను అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఆద్యా రెడ్డి, ధర్మాల వ్యాసశర్మ, జి.శంభుడు, సత్యనారాయణ, రాజు, కిశోర్, సత్యలక్ష్మి, లీలావతి, పంకజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెం శివారు గెంజిపేట గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తుంగ్లాం రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు తాత్కాలిక మూసివేత

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పరిధి ఆటోనగర్ చుక్కవానిపాలెం వద్ద గల తుంగ్లాం రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కె.రమేష్ బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ఎస్ పి/5 వద్ద రైల్వే గేటు సమీపంలో ట్రాక్ పనులు, రహదారి మరమ్మతుల కారణంగా ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు గేటును పూర్తిగా మూసివేస్తారని పేర్కొన్నారు. ఆటోనగర్, వడ్లపూడి, తుంగ్లాం రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, వాహన చోదకులు, భారీ వాహనాల డ్రైవర్లు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని సౌత్ సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: కుష్టు రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.అప్పలరాజు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా కుష్టు వ్యాధిపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి సోకిన వారిపై వివక్ష చూపించవద్దన్నారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తిస్తే, నివారణ సాధ్యమే అని తెలిపారు. అనంతరం విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో దేవాడ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా, కృపాళిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేత



మృతుని కుటుంబానికి బీమా నగదును అందజేస్తున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదును వైఎస్సార్ సీపీ 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ గురువారం అందజేశారు. అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన డొప్పా మహేశ్వరరావు (44) అనారోగ్యంతో గత నెల 30వ తేదీన మరణించారు. మృతునికి వైఎస్సార్ బీమా వర్తించడంతో, తక్షణసాయంగా తొలివిడతగా రూ.10 వేలు మంజూరయ్యాయి. ఆ నగదును గుడివాడ లతీష్ చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అక్కిరెడ్డిపాలెం సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు , వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు వరదాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

మంచినీటి కుళాయిలు ప్రారంభం



కుళాయిని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అనూష

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో మంచినీటి కుళాయిలను కార్పొరేటర్ గుడివాడ అనూష గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కాలనీలో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడటంతో, రూ.15లక్షల వ్యయంతో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్ కుమార్, కన్వీనర్లు గుర్రం త్రినాథ్, సుధాకర్, కోటేశ్వరరావు, విజయ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా పంచసూక్త హోమం



స్వామి సన్నిధిలో హోమం చేస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్ వెంకటాద్రిపై కొలువుదీరిన కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పంచసూక్త హోమం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. కోలాట బృందాల ప్రదర్శనలు అలరించాయి. ఆలయ ధర్మకర్తలు తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతులు మాట్లాడుతూ ఈ నెల 5 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నామని తెలిపారు. రోజూ స్వామి వారికి విశేష పూజలు చేయనున్నట్లు తెలియజేశారు.

రాజకీయ పక్షాలపై ఐక్యంగా పోరాడాలి



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఆంధ్ర రాష్ట్ర ప్రత్యేక హోదా సాధనకు వ్యతిరేకంగా ఉన్న రాజకీయ పక్షాలపై ప్రజలు ఐక్యంగా పోరాడాలని ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అటువంటి రాజకీయ పక్షాలను భూస్థాపితం చేయడానికి ప్రజలు సిద్ధం కావాలన్నారు. విద్యార్థి, యువజన సంఘాల మద్దతుతో హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన సమరయాత్రలో భాగంగా విశాఖ వచ్చిన ఆయన కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు రిలే దీక్షా శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఉక్కు కార్మిక వర్గం ఎంతగానో శ్రమించిందన్నారు. ఇప్పటికైనా, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని కేంద్రాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి. ఆదినారాయణ, జె. అయోధ్యరాం, వరసాల శ్రీనివాసరావు, వై.మస్తానప్ప, గుమ్మడి నరేంద్ర, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన

గాజువాక: జీవీఎంసీ 65వ వార్డులోని ప్రధాన కాలువలపై చేపట్టిన కల్వర్టుల నిర్మాణ పనులను ఆ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహ పాత్రుడు గురువారం పరిశీలించారు. రాజీవ్‌మార్గ్, భానోజీ కాలనీ వద్ద జరుగుతున్న పనులను అధికారులతో కలిసి పరిశీలించిన ఆయన నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడవద్దని సూచించారు. వీధి రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయడం కోసం ముందుగా కల్వర్టు పనులను చేపట్టినట్టు ఈ సందర్భంగా తెలిపారు. వార్డులో ప్రధాన సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిందిగా అధికారులను ఆయన ఆదేశించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ప్రతినిధి రాఘవ, ఏఈ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా లక్కరాజు



అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా గాజువాక నియోజకవర్గానికి చెందిన లక్కరాజు రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు భారత యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బి.వి.శ్రీనివాస్ నుంచి గురువారం ఆయన నియామక పత్రాలను అందుకున్నారు.

సచివాలయ కన్వీనర్ల సమన్వయకర్తగా గౌస్



గాజువాక: గాజువాక మండల పరిధిలో సచివాలయ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ల సమన్వయకర్తగా ఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ నియమితులయ్యారు. 67, 68, 69, 70 వార్డులలోని సచివాలయాల కన్వీనర్లకు ఆయన సమన్వయకర్తగా ఉంటారని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గౌస్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అభినందించారు.

పేదలకు చీరల పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: పేదలకు సేవ చేయడం అభినందనీయమని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. తొట్టెంపూడి హర్షవర్ధన్, శ్రీదేవి ఆధ్వర్యంలో 65వ వార్డుకు చెందిన పలువురు పేద మహిళలకు గురువారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాండ్రంకి జయరాజు, ఐశ్వర్య, అన్వేష్, లోకనాథం, మంగునాయుడు, సతీష్, అప్పలరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెంటమాంబ ఆలయంలో సామూహిక ధ్యాన యజ్ఞం



పెంటమాంబ ఆలయంలో ధ్యానం చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు ధ్యానం దోహదం చేస్తుందని పెంటమాంబ ఆలయ కమిటీ సభ్యులు మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, పిట్ట సత్యనారాయణరెడ్డి, నామాల పెంటయ్య అన్నారు. అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో మీసాల శివ గణేశ్వరరావు పర్యవేక్షణలో పెంటమాంబ అమ్మవారి ఆలయంలో గురువారం సామూహిక ధ్యాన యజ్ఞం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, రోజూ ధ్యానం చేయాలని సూచించారు. మనసు ప్రశాంతంగా ఉంటే ఎటువంటి జబ్బులు దరి చేరవన్నారు. కార్యక్రమంలో సుమన్, పాల చినఅప్పారావు, జంగమయ్య, పోలిరాజు, గణేష్, లక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన శైలజ



భర్త విజయకుమార్‌తో శైలజ (ఫైల్)

పరవాడ: ఉరిపోసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం స్థానిక జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో చోటుచేసుకుంది. సీఐ ఈశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుపాలెం శివారు వెంకటపతి పాలెం గ్రామానికి చెందిన పైల విజయకుమార్ కొంత కాలంగా పరవాడ ఆర్‌ఈసీఎస్ విద్యుత్ సంస్థలో సహాయ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఐదేళ్ల క్రితం పెందుర్తి మండలం పులగానిపాలెం గ్రామానికి చెందిన శైలజ(24)ను వివాహం చేసుకొన్నాడు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. వీరు ఏడాది క్రితం నుంచి పరవాడ దరి జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. భార్యాభర్తలు బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. గురువారం ఉదయం 5 గంటలకు నిద్ర లేచిన విజయ కుమార్.. పడకగదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని వేలాడుతున్న భార్యను చూసి క్వార్టర్‌లో నివాసం ఉంటున్న వారికి విషయం చెప్పాడు. ఆమెను కిందకు దించి ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందింది. సమాచారం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్న భార్య తరపు బంధువులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, తహసీల్దారు ప్రకాశరావు ఘటన స్థలాన్ని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను భర్తను, బంధువులను అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. పోస్టుమార్టం కోసం శైలజ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

రక్తమార్పిడితో నిలిచిన పాప ప్రాణం



పాపతో తల్లిదండ్రులు, కిమ్స్ ఐకాన్ నియోనాటాలజీ విభాగాధిపతి నిఖిల్

అక్కిరెడ్డిపాలెం: తీవ్ర పచ్చ కామెర్లతో ఆస్పత్రిలో చేరిన ఓ చిన్నారికి షీలానగర్ కిమ్స్ ఐకాన్ వైద్యులు రక్తమార్పిడి చేసి ప్రాణాలు నిలిపారు. ఆస్పత్రిలో గురువారం జరిగిన కార్యక్రమంలో నియోనాటాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ తెన్నేటి ఈ వివరాలు వెల్లడించారు. 'గాజువాక ప్రాంతానికి చెందిన రియానా బేగం ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పాపకు జన్మనిచ్చింది. తల్లి బ్లడ్ గ్రూప్ ఓ నెగిటివ్, బిడ్డ బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్. ఈ కారణంగా పాపకు తీవ్రస్థాయిలో పచ్చకామెర్లు సోకాయి. బిడ్డ పుట్టిన 52 గంటల తర్వాత చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చిన్నారికి వెంటనే పరీక్షలు నిర్వహించాం. పాపకు బిలిరుబిన్ 36 మిల్లీ గ్రామ్స్ ఫర్ డెసీలీటర్‌గా ఉంది. అది చాలా ఎక్కువ కావడంతో మెదడు కూడా ప్రభావితమై పాప ఊపిరి పీల్చుకోవడం కష్టతరమైంది. ఈ క్రమంలో పలుమార్లు ఫిట్స్‌కు కూడా గురైంది. దీంతో పాపకు శరీరంలో మొత్తం రక్తం తీసేసి.. అదే గ్రూప్‌కు చెందిన కొత్త రక్తాన్ని ఎక్కించాం. వెంటనే బిలిరుబిన్ స్థాయి 17.6కు తగ్గింది. ఒకే గ్రూపులో పాజిటివ్, నెగిటివ్ ఉంటే ఇలాంటి సమస్యలు తలెత్తుతాయి.'అని వైద్యుడు నిఖిల్ వివరించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి.. సంపూర్ణ ఆరోగ్యంతో చిన్నారిని డిశ్చార్జ్ చేశారు. ఈ చికిత్సలో డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

కేకే లైన్లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లు

అనంతగిరి: కేకే లైన్‌లో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతగిరి మండల పరిధిలో శివలింగపురం రైల్వేస్టేషన్ యార్డు 45వ కిలోమీటర్ వద్ద గురువారం ఉదయం 6 గంటల సమయంలో విశాఖ నుంచి కిరండూల్ వెళుతున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 8 వ్యాగన్లు పట్టాలు తప్పడంతో ట్రాక్ బాగా దెబ్బతింది. ఓహెచ్‌సీ విద్యుత్ లైన్ తెగిపోవడంతోపాటు.. పట్టాలు తప్పిన బోగీలు ఢీకొట్టడంతో రెండు స్తంభాలు ధ్వంసమయ్యాయి. రైల్వే సిబ్బంది యుద్ధప్రతిపాదికన ఘటన స్థలానికి చేరుకుని, పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఈ నెల 3న విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు. అలాగే 3న కిరండూల్–విశాఖ(08552) పాసింజర్‌నూ రద్దు చేశారు.

వీక్లీ స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ధన్‌బాద్–కోయంబత్తూర్ మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ధన్‌బాద్ – కోయంబత్తూర్ (03357 /03358) వీక్లీ స్పెషల్ ధన్‌బాద్‌లో ప్రతీ ఆదివారం ఉదయం 6 గంటలకు బయల్దేరి విశాఖ మీదుగా కోయంబత్తూర్‌కు మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రతీ మంగళవారం మధ్యరాత్రి 12.50 గంటలకు కోయంబత్తూర్‌లో బయల్దేరి విశాఖ మీదుగా గురువారం రాత్రి 10.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఈనెల 5 నుంచి మార్చి 29 వరకు నడుస్తాయి.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో టోకరా

- టాస్కుల పేరుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రూ.8.82 లక్షలకు టోపీ
- సైబర్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

దొండపర్తి : పార్ట్ టైం జాబ్ పేరుతో నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఇంటి నుంచే జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని నమ్మించి ఏకంగా రూ.8.82 లక్షలు కాజేశారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... తగరపువలస ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వాట్సాప్‌కు జీఎంఎస్ కంపెనీ రిసెప్షనిస్ట్ అని పరిచయం చేసుకుంటూ ఇంటి నుంచే పార్ట్ టైం జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని మెసేజ్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ముందు వద్దని రిప్లై ఇచ్చినప్పటికీ... అతడిని నమ్మించేందుకు అకౌంట్‌లో రూ.100 జమ చేశారు. దీంతో అది నిజం అని నమ్మి వారితో చాట్ చేయడం ప్రారంభించాడు. పార్ట్ టైం జాబ్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో ప్రకటనలు, మెసేజ్‌లు పంపించారు. వీటికి ఎవరైతే స్పందిస్తారో వారికి కమీషన్ ఆశ చూపిస్తూ కమిషన్ బేస్డ్ టాస్క్ గేమ్స్ కింద వారిని నియమించుకుంటున్నారు. ఇందుకోసం నకిలీ వెబ్‌సైట్‌ను సైతం డిజైన్ చేశారు. దీని ప్రకారం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు యూట్యూబ్‌లో వీడియోస్‌కు లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేయమని చెప్పారు. అలా చేసినందుకు ప్రతి లైక్‌కు రూ.100 నుంచి రూ.130 వరకు అకౌంట్‌లో జమ చేశారు. ఇలా మొదటి రోజు బాధితుడికి 4 వీడియోలకు లైక్ చేయమని చెప్పి రూ.400 బ్యాంక్ ఖాతాలో వేశారు. మరో టాస్క్ కోసమని టెలిగ్రాం యాప్‌కి రీడైరెక్ట్ చేసి గైడెన్స్ కోసం ఒక ట్యూటర్‌ని ఇస్తున్నట్లు చెప్పి మొదటి టాస్క్ రూ.54 వేలు పెట్టి కొనాలని నమ్మించారు. అందుకుగాను 30 శాతం కమీషన్‌తో కలిపి రూ.70,200 వస్తుందని చెప్పారు. ఇది నిజమనుకొని సైబర్ నేరగాళ్ల చెప్పినట్లు డబ్బులు ఇచ్చి కొని వారు చూపించిన వెల్ఫేర్ టాస్క్ బటన్ కొట్టగా కమీషన్‌తో కలిపి రూ.70,200 ఇస్తున్నట్లు చూపించి విత్ డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా చేశారు. డబ్బులు విత్ డ్రా చేయాలంటే తప్పనిసరిగా మరికొన్ని టాస్కులు పూర్తి చేయాలని చెప్పి అలా రూ.8.82 లక్షలు కాజేశారు. డబ్బులు విత్‌డ్రా చేసుకోవాలంటే మరికొంత డబ్బులు చెల్లించాలని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

మురళీనగర్: డిగ్రీ పూర్తి చేసిన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీసీటీఈ చీఫ్ కో–ఆర్డినేటింగ్ అధికారి బుద్దా చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జాతీయ అప్రంటీస్‌షిప్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, డిగ్రీ పాస్ అయిన విద్యార్థులకు పరిశ్రమల్లో ఏడాది పాటు అప్రంటీస్‌షిప్ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం కంపెనీలు నైపుణ్యం కలిగిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటారని చెప్పారు. వర్క్‌షాప్‌లో సుమారు వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.